క్లుప్తంగా

5న చలో హైదరాబాద్

నర్వ: విశ్వబ్రాహ్మణుల సమస్యల సాధన కోసం ఈ నెల 5న చేపట్టిన చలో హైదరాబాద్‌కు తరలిరావాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు యాంకి ఆచారి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల బలిదానాల మీద వచ్చిన తెలంగాణలో విశ్వబ్రాహ్మణులను, విశ్వకర్మలను ప్రభుత్వం నమ్మించి వంచించిందన్నారు. న్యాయమైన వాటాను బడ్జెట్‌లో కేటాయించి మోసం చేసిందన్నారు. ఈ నెల 5న ఉప్పల్ భగాయత్‌లో పెద్ద ఎత్తున చేపట్టే నిరసన కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు. ప్రతి విశ్వబ్రాహ్మణుని కుటుంబానికి డబుల్ బెడ్రూం కేటాయించాలన్నారు. ఈ సమస్యల సాధనకు చేపట్టే నిరసనకు జిల్లా వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణులు తరలిరావాలన్నారు.

బీఎస్పీ ఇంటింటి ప్రచారం



ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్, అమీన్‌పూర్ గ్రామాల్లో బీఎస్పీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు.. బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్కటం జగన్నాథ్ రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఏనుగు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, వెంకటయ్య, బండారి చంద్రశేఖర్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు



మాగనూర్: ప్రభుత్వ కార్యాలయాల్లో విలువైన పత్రాలు, వస్తువులతోపాటు ప్రభుత్వ సిబ్బంది రక్షణకోసం ప్రభుత్వం రూ. వేలు ఖర్చుచేసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో అవి మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు వృథాగా పడి ఉన్నాయి. వీటిని అధికారులు ప్రతిరోజు చూస్తునే ఉన్న తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. చిన్నపాటి ఖర్చుతో మరమ్మతులు పూర్తిచేసుకుని, వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కిరాణ షాపులో మద్యం సీసాల పట్టివేత



అమరచింత: పట్టణంలోని కిరాణ షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. పట్టణానికి చెందిన కటిక వెంకటేష్ కిరాణం షాప్‌లో అక్రమంగా మద్యం సీసాలను నిల్వ ఉంచి అమ్ముతుండగా యజమానిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బెల్టు షాపులపై చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా అక్రమంగా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తాం



ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో శివశంకర్, చిన్ననర్సింహ, విష్ణురెడ్డి, నాగేందర్‌రెడ్డి, కొండపురం రాము, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్, లక్ష్మీనారాయణ, ఎల్లన్న, రాజు తదితరులు ఉన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

- అదనపు ఎస్పీ నాగేంద్రుడు



ధన్వాడలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ధన్వాడ: ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడానికి జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని అదనపు ఎస్పీ నాగేంద్రుడు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొండాపూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ జిల్లా పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని ప్రజల్లో ధైర్యాన్ని కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడమే లక్ష్యంగా ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తున్నామని కేంద్ర బలగాలు కీలకపాత్రను పోసిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటు వేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి ఓటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దాసర్‌దొడ్డిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతు న్నాయన్నారు. కార్యక్రమంలో తెలంగాణ క్రీడల చైర్మన్ ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ నర్సింహాగౌడ్, వెంకట్‌రాములు, అమరేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా: రైతు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుసుమర్తిలో భీమానది ఒడ్డున ఉన్న మఠంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తనయుడు శివరాజ్‌పాటిల్, సింగిల్ విండో డైరెక్టర్ విజయ్‌గౌడ్, నాయకులు శేఖర్‌రెడ్డి, మోనేష్, శివప్ప, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పాలనను అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

నారాయణపేట రూరల్: నాడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలకు ఉపయోగపడే ఎన్నో పథకాలు అమలు చేశాడనే అలాంటివి తిరిగి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్పకుండా ఏర్పాటు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మరికల్ మండల గ్రామాలు చిత్తనూర్, ఎక్లాస్‌పూర్ గ్రామ ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను తొలగించి కోరుతూ ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందించారు. ఎన్నికల వేళ వారు స్వేచ్ఛగా పోలింగ్ బూత్‌కు వచ్చి ఓట్లు వేసేవిధంగా చర్యలు తీసు కోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సదాశివరెడ్డి, మాజీ మార్కెట్‌చైర్మన్ సుధాకర్, కౌన్సిలర్ సలీం నాయకులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

మక్తల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి ఓటర్లను కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో మక్తల్‌కు చెందిన వివిధపార్టీల నుంచి దాదాపు 150మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మక్తల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, కావలి తాయప్ప, ఈసరి నాగప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



చిన్నచింతకుంట: అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దన్నారు. సహకార సంఘం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని తరలించి విక్రయించుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఖాళీ బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ఆరబెట్టి కేంద్రానికి తీసుకు రావాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ. 2180 చెల్లిస్తారని వివరించారు. సంఘం సీఈఓ బషీర్, స్టాఫ్ అసిస్టెంట్ గోవిందరాజు, ఏఈఓ శ్రీజ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..!



మరికల్: జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు మరమ్మతులకు నోచుకోక ప్రమాదాలకు నిలయంగా మారింది. కల్వర్టులు ప్రమాద భరితంగా మారడంతో తరచుగా వాహనచోదకులు ప్రమాదాలకు గురువుతున్నారు. ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. అలాగే ఆత్మకూర్ రోడ్డు పరిస్థితి చూస్తే అడుగు, అడుగుకు ఓ గుంత ఏర్పడింది. రాత్రి సమయంలో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి గురించి ఏనాడు ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపన పోలేదు.

ఈ మలుపు.. ప్రమాదానికి పిలుపు

మద్దూరు: మద్దూరు నుంచి పెదిరిపాడ్ మీదుగా నారాయణపేట వెళ్లే రోడ్డులో పెదిరిపాడ్ చెరువుకట్ట వద్ద ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఏదో ఓ సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ రోడ్డు గతంలో మోటల్‌రోడ్డు ఉండేది. పదేళ్ల క్రితం ఆర్అండ్‌బీ నిధులతో ఈ రోడ్డును బీటీగా మార్చారు. నారాయణపేటకు ఈ రూట్లో వెళ్తే దూరం తగ్గుతుండడంతో ఈ రూట్లో వెళ్లడానికి వాహనదారులు మొగ్గుచూపుతున్నారు. కానీ ఎక్కడ ప్రమాద సూచికలు పెట్టకపోవడం, స్పీడ్ బ్రేక్‌లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో తరుచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ప్రమాదహెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక..



పార్టీలో చేరిన వారితో వాకిటి శ్రీహరి

దామరగిద్ద: మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు హన్మంతు, సర్పంచ్ పెంటప్ప కుంభం శివకుమార్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని ముదిరాజ్‌లను గుర్తించిన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఖాజా పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు జోరందుకున్నాయి. శుక్రవారం మండలంలోని ఓబ్లాపూర్ నుంచి భారీగా వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



దామరగిద్దలో ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరూ కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం మండలంలోని దామరగిద్ద తండా, సజనాపూర్, పిడెంపల్లి, మల్‌రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం చేసి మాట్లాడారు.. అధికారంలోకి రాగానే పార్టీ ఇచ్చిన ఎన్నికల మెనిఫెస్టోను అమలు చేస్తామన్నారు. గత పదేళ్ల ఆదరించడంతో ఎంతో అభివృద్ధి చేసి చూపించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, ఈదప్ప, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, అశోక్, వెంకట్‌రెడ్డి, భీంరెడ్డి, తిప్ప న్న, శరణప్ప, మాణిక్యప్ప, గురునాథ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కిషన్‌రావు, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంను తొలగించాలి



మాట్లాడుతున్న నంబిరాజు

చిన్నచింతకుంట: మండలంలోని ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు డిమాండ్ చేశాడు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చెక్‌డ్యాం ప్రమాదంగా మారిందన్నారు. గ్రామసమీపంలో నిర్మించడంతో పక్కన ఉన్న శ్మశాన వాటికలోకి చెక్‌డ్యాం నీరు చేరి దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. నీరు చేరడం వల్ల శవాలు తేలే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం చెక్‌డ్యాంలో ఉన్న బోరు పంపులనుంచే గ్రామానికి మంచినీరు అందుతోందని.. తాగితే ప్రజలకు రోగాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని.. లేనిచో ఈనెల 5, 6 తేదీల్లో చింతకుంట బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, దశరత్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



నారాయణపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న స్వాతిరెడ్డి



మక్తల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణపేట రూరల్: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి కారు గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సతీమణి స్వాతిరెడ్డి అన్నారు. పట్టణంలోని 18, 19వ వార్డుల్లో శుక్రవారం ఇంటింటి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు.. ఒక్కొక్కరిని కలుసుకుని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని పార్టీ జిల్లా నాయకులు రామస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. అలాగే అప్పంపల్లి, పస్పుల, ఎలిగండ్ల, తీలేర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో శ్రీను, కమల్, బాలకృష్ణ, మాసప్ప, గోపాల్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని యువనాయకుడు చిట్టెం చాణిక్యరెడ్డి ఓటర్లను కోరారు. శుక్రవారం పట్టణంలో వివిధ వార్డులలో కార్యకర్తలతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్, శివారెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

సమష్టిగా కాంగ్రెస్ గెలుపునకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి

మక్తల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు సమష్టిగా కృషిచేద్దామని నియోజకవర్గ నాయకుడు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు.. అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షుడు బూత్‌స్థాయి కార్యకర్తలు, నాయకులు కలిసి రాబోయే ఎన్నికల్లో కష్టపడితే విజయం ఖాయమన్నారు. నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, మాజీ మార్కెట్ చైర్మన్ రవికుమార్‌యాదవ్, రామరావు, జిల్లా మత్స్యకారా సంఘం చైర్మన్ కోళ్లవెంకటేష్, గోపాల్‌రెడ్డి, నీలప్ప, సూర్యనారాయణ, గంగాధర్‌గౌడ్, తాయప్ప, కట్టసురేష్, వెంకటేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తరగతి గదిలో పాఠాలు చెబుతుండగా..

ఉపాధ్యాయుడికి గుండె పోటు

- మహబూబ్‌నగర్‌లో చికిత్స పొందుతూ మృతి



ఊట్కూరు: తరగతి గదిలో పాఠాలు చెబుతూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండెపోటుకు గురై.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన ఊట్కూరు మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో అనిల్‌కుమార్ ఎడ్కే(54) హిందీ పండితుడిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం తరగతి గదిలో పాఠాలు చెబుతుండడంగా ఛాతీలో నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక వైద్య సిబ్బందిని పిలిపించి.. సీపీఆర్ చేయించారు. అనంతరం మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధ్యాయుడి మృతికి హెచ్ఎం స్పందన, ప్రేమకుమారి, మండల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. పాఠశాలలో నివాళి అర్పించి.. విద్యార్థులకు సెలవు ప్రకటించారు.

మరమ్మతులకు నోచుకోని బీటీరోడ్డు



మురహర్‌దొడ్డి రోడ్డులో గుంతలు

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డి గ్రామ బీటీరోడ్డు గతరెండు సంవత్సరాలుగా మరమ్మతులు చేయించకపోవడంతో ఆ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రస్తుతం రోడ్డు వెంబడి ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టై రోడ్డు నుంచి మురహర్‌దొడ్డి వరకు బీటీ రోడ్డు మరమ్మతులకు గాను సంవత్సరం క్రితమే ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని గ్రా మస్తులు తెలియజేస్తున్నారు. ఈ విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే రోడ్డుకు మరమ్మతుపనులు జరగడం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



మరికల్‌లో మాట్లాడుతున్న పర్ణికారెడ్డి



కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

మద్దూరు: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని భారీ మేజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి కార్యకర్తలకు, ప్రజలను కోరారు. శుక్రవారం కొత్తపల్లి మండల కేంద్రంలో, నిడ్జింత గ్రామాల్లో కాంగ్రెస్ కార్యాలయాలను ప్రారంభించి మాట్లాడారు.. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల ద్వారా అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వివిధ గ్రామాలకు చెందిన వారు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింహ, రమేష్‌రెడ్డి, సంజీవ్, చెన్నప్ప, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌కుమార్, వెంకట్ పాల్గొన్నారు.

నర్వ: నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరిని భారీ మెజార్టీతో గెలిపించాలని పీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కోర్ కమిటీ సభ్యులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి ఓటర్లను కోరారు. చెన్నయ్యసాగర్, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శరణప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, అయ్యపురెడ్డి, రవిసాగర్, వెంకటేష్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్, రాకొండ గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డి ప్రచారం చేశారు. అనంతరం రెండు గ్రామాల నుంచి 150మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, సూర్యమోహన్, నరహరి, జయసింహారెడ్డి, హరీష్, రామకృష్ణ, కృష్ణయ్య, మొగులప్ప, శివకుమార్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వినతి

కోస్గి: పట్టణంలోని పలు కాలనీలో పారిశుద్ధ్య చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు నిండిపోయాయని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని శుక్రవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. 9వ వార్డుకు చెందిన అధికార పార్టీ నాయకుడు వెంకట్‌నర్సింహులు ఆధ్వర్యంలో పలువురు మున్సిపల్ మేనేజర్ శంకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, ప్రజాప్రతినిధులకు సైతం ఫిర్యాదు చేసిన స్పందించడం లేదన్నారు. వార్డులోకి చెత్తసేకరణ వాహనాలు సరిగ్గారావడం లేదని, డ్రెయినేజీ నుంచి తీసిన చెత్త కుప్పలను తొలగించకపోవడంతో కాలనీలు కంపుకొడుతున్నాయన్నారు. వెంటనే పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కొనేరు సాయప్ప, ప్రకాష్, మణెమ్మ, నర్సింహులు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు